రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం

సివిల్ సప్లయ్ డీఎంకు విన్నవిస్తున్న రైతులు

వేంసూరు, నవంబర్ 16: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లయ్ డీఎం శ్రీలత అన్నారు. శనివారం లచ్చన్నగూడెం సొసైటీ పరిధిలోని మర్లపాడు, వేంసూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. కొందరు రైతులు తాలు లేకుండా తేమశాతం ఉన్నప్పటికీ మిల్లర్లు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చి బాగుంటునే తీసుకుంటున్నారని, దానివల్ల తమకు ఇబ్బంది కలుగుతుందని రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా మిల్లర్లకు లారీల ద్వారా పంపించిన ధాన్యాన్ని తరుగు, పొట్టతెలుపు ఉందని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, లారీలోని ధాన్యాన్ని దించుకోవడం లేదని, సొసైటీ సీఈవోలు తమ ఆవేదనను ఆమెకు వెళ్లబుచ్చారు. దీనిపై ఆమె మాట్లాడుతూ మిల్లర్లతో మాట్లాడి గన్ని బ్యాగులు మంచి పంపించేలాగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆమె వెంట ఆర్ఐ శ్రీనివాస్ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వేంసూరు, నవంబర్ 16: మండలంలోని కల్లూరుగూడెం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ సమాఖ్య మండల అధ్యక్షురాలు కావూరి రమణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఏపీఎం శ్రీనివాస్, సీసీ చెన్నారావు, వీవోలు సునీత, పసుమర్తి సత్యనారాయణ, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ రహదారులే ధాన్యం కేంద్రాలు

రోడ్లకు ఇరువైపులా ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

పెనుబల్లి, నవంబర్ 16: మండలంలోని కుప్పనకుంట్లలో భద్రాచలం నుంచి విజయవాడ వరకు వెళ్తున్న జాతీయ రహదారిపై ధాన్యం రాసులను ఇరువైపులా ఆరబోశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడంతో వర్షాలు వస్తే ధాన్యం తడిసిపోతాయని అందుకే రోడ్లపై త్వరగా ఎండుతాయని ఆరబోస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే

సర్వే నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కారేపల్లి, నవంబర్ 16: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే శనివారం మండలంలోని గ్రామాల్లో అధికారులు ముమ్మరంగా నిర్వహించారు. ఒక్కొక్క ఎన్యుమనేటర్ 10 కుటుంబాల చొప్పున ఇంటింటికి వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు. మండల వ్యాప్తంగా 150 మంది ఉద్యోగ సిబ్బంది సర్వేలో పాల్గొన్నారు. తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీవో సురేందర్ సర్వేను పర్యవేక్షించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

సత్తుపల్లిటౌన్, నవంబర్ 16: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన ఘటన సత్తుపల్లి మండలం బేతుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బేతుపల్లి గ్రామంలో పసుమర్తి సాంబశివరావు(32) కొద్దిరోజుల నుంచి వరిగడ్డి తోలకాలకు వెళ్తున్నాడు. ప్రతిరోజూలాగే వెళ్లివచ్చి శుక్రవారం రాత్రి ఇంటి వద్ద పడుకున్నాడు. శనివారం తెల్లవారుజామున కూలీలు వచ్చి పిలిచినా రాకపోవడంతో వారు వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత మంచం పక్కన తలభాగంలో గాయాలై అచేతనంగా పడి ఉన్న సాంబశివరావును కుటుంబ సభ్యులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958-AII

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

నేడు, రేపు గ్రూప్-3 పరీక్షలు

ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం
ఖమ్మంజిల్లాలో 87 పరీక్షా కేంద్రాలు..
27,984 మంది అభ్యర్థులు

పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

మామిళ్లగూడెం, నవంబర్ 16: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17, 18వ తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-3 రాత పరీక్షలకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 87 పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు మౌలిక వసతులను కల్పించారు. ఈ పరీక్షలకు 27,984 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం సెషన్స్‌లో 8:30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించనున్నారు. 10గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష జరుగనుంది. మధ్యాహ్నం సెషన్‌లో అభ్యర్థులను 1:30 నుంచే అనుమతించనున్నారు. 18వ తేదీన ఉదయం 10 నుంచి 12:30 వరకు పరీక్ష జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

పకడ్బందీ ఏర్పాట్లు : అదనపు కలెక్టర్ శ్రీజ

జిల్లాలో గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. శనివారం పలు పరీక్షా కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి హాల్‌లో 24 మంది అభ్యర్థులకు మాత్రమే సిట్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులను పక్కాగా పరిశీలించిన తర్వాతే లోపలికి అనుమతించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, మెడికల్ క్యాంపులు పక్కాగా ఉండాలన్నారు. అన్నింటికి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. అభ్యర్థులు టీజీపీఎస్సీ నుంచి డౌన్‌లోడ్ చేసిన హాల్‌టికెట్‌ను తీసుకుని ఫొటో సరిగా లేకుంటే గెజిటెడ్ అధికారితో అటెస్టెడ్ చేయించుకోవాలని, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకు రావాలని సూచించారు. ఈ తనిఖీల్లో స్టీఫెన్, పుల్లారావు, కిరణ్, గోపాల్ పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షా కేంద్రాల సందర్శన

కొణిజర్ల, నవంబర్ 16: ఆదివారం జరుగనున్న గ్రూప్-3 పరీక్షా కేంద్రాలను ఖమ్మం ఆర్డీవో నరసింహారావు శనివారం పరిశీలించారు. మండలంలో మొత్తం 7 సెంటర్లలో పరీక్ష జరుగనున్నది. ఇందుకు మొత్తం మూడు సెషన్లలో 2600 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. తనికెళ్లలోని విజయ ఇంజినీరింగ్ కళాశాలలో 4, తనికెళ్లలోని గ్రేస్ పాఠశాలలో 1, శాంతినగర్‌లోని సెయింట్‌అలాసియస్‌లో 1, పల్లిపాడు కార్తీక్ విద్యాలయంలో 1 కేంద్రంలో పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ తఫజుల్ హుస్సేన్, ఆర్ఐ అశోక్ పాల్గొన్నారు.

2025 నాటికి క్షయ నియంత్రణే లక్ష్యం

మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి

మధిర, నవంబర్ 16: క్షయవ్యాధి 2025 నాటికి నియంత్రణే లక్ష్యంగా ముందుకు సాగాలని డీఎంహెచ్‌వో బానోత్ కళావతిబాయి అన్నారు. శనివారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గల టీబీ యూనిట్‌ను ఆమె సందర్శించారు. ప్రజలకు అందుతున్న సేవలు, పరీక్షలు, మందులు అందే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వ్యాధి సోకిన వారు మందులు సకాలంలో వాడాలని, బలమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం సేవా వికాస స్వచ్ఛంద సంస్థ అసోసియేషన్ సభ్యులు పార్థసారథి, గీత అందించిన దుప్పట్లను టీబీ వ్యాధిగ్రస్తులకు డీఎంహెచ్‌వో అందజేశారు. మధిర సివిల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిల్‌కుమార్, డాక్టర్ పృథ్వినాయక్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ సందీప్, హెల్త్‌సూపర్‌వైజర్ కొండయ్య, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, హెల్త్‌అసిస్టెంట్ శ్రీనివాస్, ఫార్మాసిస్ట్ ఫైమున్, రేడియోగ్రాఫర్ సుదర్శన్ సిబ్బంది పాల్గొన్నారు.

కళలు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి

కళలు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని డీఎంహెచ్‌వో కళావతిబాయ్ అన్నారు. శనివారం పట్టణంలో జరుగుతున్న జాతీయ బాలోత్సవ్ కార్యక్రమానికి హాజరయ్యారు. చిన్నారుల స్వాగత గీతంతో రామభక్త సీతయ్య కళాపరిషత్ నిర్వహించే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లలను ప్రోత్సహిస్తూ వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం, సాంస్కృతిక కళలు ద్వారా ప్రదర్శన చేయించడం, ప్రతి మనిషికి మానసిక ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. గత 27 సంవత్సరాల నుంచి కళాపరిషత్ నిర్వాహకులు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, మధిర సాంస్కృతిక రథసారథి బాబ్లా, మిత్ర బృందం సేవలను అభినందించారు. అనంతరం వివిధ కళలు ప్రదర్శన చేసిన పిల్లలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, బాబ్లా, పారుపల్లి సురేష్, బేగం, మోహంతరావు, జానపద, మిమిక్రీ కళాకారుడు లంకా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జోరుగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

బహుమతులు అందజేసిన డీఈవో, డీవైఎస్‌వో
ఓవరాల్ చాంపియన్‌షిప్ కోసం పోటాపోటీ

విజేతలకు మెమెంటో బహూకరిస్తున్న డీఈవో, డీవైఎస్‌వో

ఖమ్మం సిటీ, నవంబర్ 16: ఖమ్మం జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం 68వ రాష్ట్రస్థాయి అండర్-14 బాల, బాలికల రాష్ట్రస్థాయి పోటీలు జోరుగా సాగుతున్నాయి. రెండోరోజు బాలబాలికలకు 100 మీటర్లు, 400 మీటర్లు పరుగుపందెం, డిస్కస్‌త్రో, హైజంప్, లాంగ్‌జంప్‌తోపాటు 400 మీటర్లు రిలే అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన ఈవెంట్స్‌లో ఆదిలాబాద్, మెదక్, వరంగల్, ఖమ్మం జట్లు పతకాలు సాధించి ముందంజలో ఉన్నాయి. ప్రధానంగా బాలుర విభాగంలో ఆదిలాబాద్, వరంగల్, నల్గొండ, బాలికల విభాగంలో ఖమ్మం, ఆదిలాబాద్, హైదరాబాద్ జట్లు ఓవరాల్ చాంపియన్ రేసులో పోటీ పడుతున్నాయి. చివరిరోజైన ఆదివారం జరిగే తుది పోరులో ఓవరాల్ చాంపియన్‌షిప్ విజేతలెవరో తేలిపోనుంది. కాగా పోటీల అనంతరం విజేతలకు డీఈఓ సోమశేఖరశర్మ, జిల్లా యువజన క్రీడల అధికారి టీ సునీల్‌రెడ్డి బహుమతులు అందజేశారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి నరసింహామూర్తి క్రీడలను పర్యవేక్షించారు.

విజేతలుగా నిలిచిన బాలురు..

హైజంప్ : జే శ్రీకాంత్ (మెదక్), ఏ దిల్‌షన్ (మహబూబ్‌నగర్), జే అఖిల్ (రంగారెడ్డి).

400 మీటర్ల పరుగు : కే సాయి ఆదిత్య (రంగారెడ్డి), కే నగేష్ (ఆదిలాబాద్), కే జాకేష్ (ఆదిలాబాద్)

100 మీటర్ల పరుగు : ఆర్ కార్తీక్ (ఆదిలాబాద్), కే ప్రవీణ్ (నల్గొండ), జీ బాచి (వరంగల్).

డిస్కస్‌త్రో : కే శ్రీకాంత్ (ఆదిలాబాద్), ఎం ముత్తు (మహబూబ్‌నగర్), వీ శివకుమార్ (రంగారెడ్డి).

లాంగ్‌జంప్ : కే ప్రవీణ్ (నల్గొండ), ఏ దిల్షన్ (మహబూబ్‌నగర్), కే శ్రీద్రితీరెడ్డి (మెదక్).

విజేతలుగా నిలిచిన బాలికలు..

షాట్‌పుట్ : ఏ వినూత్న (హైదరాబాద్), ఎస్ సమంత (వరంగల్), జీ ధాన్య (మెదక్)

హైజంప్ : ఎస్ సహార (ఆదిలాబాద్), కే సాయిశ్రీ (రంగారెడ్డి), కే శ్రీద్రితీరెడ్డి (మెదక్)

400మీటర్ల పరుగు : ఏ జాహ్నవి (కరీంగనర్), ఎం రాజేశ్వరి (వరంగల్), టీఎస్ ధాన్య (హైదరాబాద్).

డిస్కస్‌త్రో : ఏ వినూత్న (హైదరాబాద్), జీ ధాన్య (మెదక్), డీ మధుప్రియ (ఖమ్మం)

100మీటర్ల పరుగు : జీ నక్షత్ర (కరీంనగర్), వైశృతిహాసన్ (ఖమ్మం), ఏ శైలజ (ఆదిలాబాద్).

ఎలాంటి షరతులు లేకుండా బోనస్ చెల్లించాలి

వైరాటౌన్, నవంబర్16: ధాన్యం కొనుగోలు కోసం బియ్యం గింజ కొలతలకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మైక్రో మిషన్ పద్ధతి ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వైరా వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు కేంద్రం వద్ద రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా 32 రకాల ధాన్యాన్ని సన్న ధాన్యంగా గుర్తించి ప్రభుత్వం కొనుగోలు చేసి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

అన్ని రకాల ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

పెనుబల్లి, నవంబర్ 16: అన్ని రకాల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక చలమాల సూర్యనారాయణ భవనంలో చిమట విశ్వనాథం అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26న సీపీఎం డివిజన స్థాయి మహాసభ వీఎం బంజర సప్తగిరి కల్యాణ మండపంలో జరుగుతుందని పేర్కొన్నారు.

కడుపునొప్పి తాళ లేక బాలిక ఆత్మహత్య

ముదిగొండ, నవంబర్ 16: కడుపునొప్పి తాళలేక బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సువర్ణాపురానికి చెందిన వుల్పుల భార్గవి (16) సోమవారం రాత్రి గుడికి వెళ్లివచ్చింది. రాత్రి 11:00 గంటల సమయంలో కడుపునొప్పి రావడంతో ఈ విషయం ఇంట్లోవారికి చెప్పకుండా గడ్డి మందు తాగింది. దీంతో వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురైంది. మంగళవారం ఉదయం కుటుంబసభ్యులు ఆర్ఎంపీకి చూపించి మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీ తెలిపారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో 9 మందికి గ్రూప్-4 ఉద్యోగాలు

మామిళ్లగూడెం, నవంబర్ 16 : జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన 9 మంది అభ్యర్థులు గ్రూప్-4 ఉద్యోగాలు సాధించారని స్టడీ సర్కిల్ కార్యదర్శి కస్తాల సత్యనారాయణ శనివారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాల్లో స్టడీ సర్కిల్ అభ్యర్థులు విజయం సాధించారని పేర్కొన్నారు. అదేవిధంగా ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో 12మంది ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని తెలిపారు. గ్రూప్-4 ఉద్యోగాలు సాధించిన వారిలో తొర్లపాటి రామకృష్ణ, పళ్ల సాయికిరణ్, కంచపోగు శ్రీకాంత్, బలవంతపు రాజా, జక్కుల వేణు, కంచపోగు బాలకృష్ణ, మాలోత్ నర్సింహారావు, కాసిమళ్ల శ్రీశైలం, చలువాది శ్రావణి ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు.

వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇవ్వాలి

ఖమ్మం, నవంబర్ 16 : వ్యవసాయ కూలీలకు జీవనభృతిగా ఏడాదికి రూ.12,000 ఇస్తానని హామీ ఇచ్చిన కాంగ్రెస్ వెంటనే అమలు చేయాలని ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కృష్ణ అన్నారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐపీకేఎంఎస్) రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పి.రామకృష్ణ, వెంకటేశ్వరరావు, వెంకయ్య, అర్జున్‌రావు, హనుమంతరావు, లాజర్, సలీం, రాము, భాస్కర్, రాజు, సాయన్న, కిషన్ పాల్గొన్నారు.

భద్రాద్రి బ్యాంకులో సహకార వారోత్సవాలు

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 16 : నగరంలోని భద్రాద్రి కోఆపరేటివ్ బ్యాంకు కార్యాలయంలో శనివారం 71వ సహకార వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి డీసీవో గంగాధర్‌తో కలిసి సహకార పతాకాన్ని ఎగురవేసి, సహకార గీతాన్ని ఆలపించారు. అనంతరం డీసీవో మాట్లాడుతూ సహకార వ్యవస్థకు 120 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. 1904 సంవత్సరంలో సహకార వ్యవస్థ ప్రారంభమై నేడు ఎన్నో సంఘాలతో వరాజిల్లుతుందన్నారు. చైర్మన్ కృష్ణమూర్తి మాట్లాడుతూ రిజర్వు బ్యాంకు ఇచ్చిన హామీకి అనుగుణంగా భద్రాద్రి బ్యాంకు రూపుదిద్దుకుంటుందన్నారు. తమ బ్యాంకు ఆధ్వర్యంలో సహకార వారోత్సవాలు ఎంతో ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వరంగల్ సహకారశాఖ శిక్షణ ఫ్యాకల్టీ రాజయ్య, సహకారశాఖ రిజిస్ట్రార్ ఉషశ్రీ, బ్యాంకు సీఈవో దాసరి వేణుగోపాల్, డీజీఎం ఎల్‌వీ ప్రసాద్, మేనేజర్లు శ్యాంసుందర్, రామారావు, రాజేంద్రకిషోర్, నర్సింమమూర్తి, యంవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడు మృతి పట్ల సంతాపం

ఖమ్మం, నవంబర్ 16 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సోదరుడు, సినీనటుడు నారా రోహిత్ తండ్రి రామ్మూర్తినాయుడు మృతి పట్ల శనివారం పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో బీఆర్ఎస్ నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నారు. రామ్మూర్తినాయుడు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు.

పెద్దాసుపత్రిలో కలప వేలం

ఖమ్మం సిటీ, నవంబర్ 16 : జిల్లా సార్వజనీన ఆసుపత్రి ఆవరణలోని నాన్ టేకు కర్ర దుంగలు ఈ నెల 25వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నామని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11గంటలకు జరిగే వేలంలో పాల్గొనదలచిన వారు రూ.10 వేలు ఈఎండీని మెడికల్ సూపరింటెండెంట్ గవర్నమెంట్ హాస్పిటల్ ఖమ్మం పేరుతో డీడీ తీసి ఈ నెల 23న సాయంత్రం 5గంటల్లోపు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఆయుర్వేద వైద్య కేంద్రానికి యోగా ఇక్వేషన్

వైరారూరల్, నవంబర్ 16: మండలంలోని గొల్లపూడి ఆయుర్వేద ఆసుపత్రికి రాష్ట్ర ప్రభుత్వం ఆయుర్వేద డిక్షనరీ విభాగం కింద వైరాలోని బ్రహ్మణపల్లికి చెందిన పి. పద్మావతి, మధిర మండలానికి చెందిన ఎం. కృష్ణను శనివారం యోగా ఈక్వేషన్ కింద నియమించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న వారు యోగా తరగతులకు హాజరుకావాలని కోరారు.

'మంచి స్పర్శ.. చెడు స్పర్శ'పై అవగాహన

మాట్లాడుతున్న సోనిప్రేమ్‌లీనా

సత్తుపల్లిటౌన్, నవంబర్ 16: నేటి సమాజంలో చిన్న పిల్లలపై పెరుగుతున్న లైంగిక దాడులు, హత్యాచారాలు వీటి బారీన పడకుండా తమను తాము కాపాడుకొని ప్రమాదం నుంచి తప్పించుకునే విధంగా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ సోనిప్రేమ్‌లీనా ఆధ్వర్యంలో 'మంచి స్పర్శ.. చెడు స్పర్శ'పై అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని ఎన్టీఆర్‌కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాకర్లపల్లి ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాల, ఎంపీపీఎస్ హరిజనవాడ స్కూల్, ఎంపీపీఎస్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. సీడీపీవో కనకదుర్గ, మాధవి, అనీత, హెచ్ఎం సరోజిని, శ్రీనివాసరావు, నర్సింహారావు, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

సత్తుపల్లిటౌన్, నవంబర్ 16: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి తల్లాడ మండలంలోని 60 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు, రూ.2 లక్షల రుణమాఫీ, సన్నరకం ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ త్వరలో అందుతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్పమాలధారుల ఇరుముడి

పెనుబల్లి, నవంబర్ 16: మండలంలోని తాళ్లపెంటలో అయ్యప్ప మాలధారుల ఇరుముడి వేడుకలు శనివారం నిర్వహించారు. తాళ్లపెంట గ్రామానికి చెందిన యువకులు, చిన్నారులు 40 రోజులుగా దీక్ష చేపట్టడంతో వారికి గురువులు శనివారం వీరరాఘవస్వామి ఆలయంలో ఇరుముడి కట్టి సాగనంపారు. ఇరముడికి వచ్చిన భక్తులకు బంధుమిత్రులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. పీఠం నుంచి గ్రామ శివారు వరకు పాదయాత్ర చేపట్టారు.

బాలోత్సవ్‌లో మహాదేవపురం విద్యార్థుల ప్రతిభ

మధిర రూరల్, నవంబర్ 16: రామభక్త సీతయ్య కళాపరిషత్ ఆధ్వర్యంలో మధిరలో జరుగుతున్న 27వ జాతీయ స్థాయి బాలోత్సవ్‌లో మహాదేవపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచి బహుమతులు సాధించారు. జానపద నృత్య బృందం విభాగంలో విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించారని పాఠశాల హెచ్ఎం సాధు సమాధానం తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఖాళీ స్థలాల యాజమానులకు నోటీసులు

మధిర, నవంబర్ 16: పురపాలక సంఘం పరిధిలో ఖాళీ స్థలాల యజమానులకు మధిర మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం సిబ్బంది నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు నేను నా మధిర క్లీన్ అండ్ గ్రీన్ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారన్నారు. ఈ ఖాళీ స్థలాన్ని తక్షణమే శుభ్రపర్చుకోవాలని, లేనట్లయితే ఈ స్థలాన్ని మున్సిపాలిటీ వారు 153, 156, 161, 162 సెక్షన్ల ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళా కబడ్డీ విజేత విజయనగరం

కూసుమంచి, నవంబర్ 16: నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా జరిగిన తెలుగు రాష్ట్రాల మహిళా కబడ్డీ పోటీల విజేతగా విజయనగరం జట్టు నిలిచింది. విజేతలకు శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తంబూరి దయాకర్ రెడ్డి, కబడ్డీ జిల్లా అసోసియేషన్ నల్లమల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ దండా పుల్లయ్య బహుమతులు అంజేశారు. ద్వితీయ బహుమతి శ్రీకాకుళం జట్టు సాధించింది. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన వెన్నెపూసల సీతారాములు, శాఖమూరి రమేశ్, గండు సతీశ్, నెల్లూరి భద్రయ్య, జెర్రిపోతుల అంజని, బచ్చలకూర నాగరాజు, దండా సతీశ్, నిర్వాహకులు దండా నర్సిహరావు, లెనిన్, దండా నవీన్, వీరవెల్లి నాగరాజు, సోందు, తాటి కొండ రవి, దంతాల రవి, దండా రాధాకృష్ణ పాల్గొన్నారు.

పేద క్రైస్తవులకు క్రిస్మస్ దుస్తులు అందజేయాలి

ఎర్రుపాలెం, నవంబర్ 16: క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రైస్తవులకు దుస్తులు అందించాలని కోరుతూ మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో రెవరెండ్ పాస్టర్ కోట ఆదాంఎలిషా ఆధ్వర్యంలో పాస్టర్లు శనివారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. పేద క్రైస్తవులకు సబ్సిడీపై రుణాలు మంజూరు చేయాలని, క్రిస్మస్ సందర్భంగా చర్చిలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రెజరర్స్ పులి వినోద్, మండల సెక్రెటరీ దేవరకొండ జైపాల్, పగిడిపల్లి స్వామి, కొమ్ము జీవానందం, కేఎస్ రత్నం, కృష్ణవేణి, తెరాటి ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం, నవంబర్ 16: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని శనివారం భక్తులు ప్రత్యేక పూజలు, దీపోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఆలయంలో నిర్వహించే సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతంలో భాగంగా శనివారం సుభద్ర కల్యాణం అనే హరికథా కాలక్షేపం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస్, అర్చకుడు ఎం వెంకటరమణ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీ ఖాతాదారులకు అవగాహన సదస్సు


చెక్కును అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

సత్తుపల్లిటౌన్, నవంబర్ 16: మండలంలోని బీ గంగారం ఏపీజీవీబీ ఆధ్వర్యంలో శనివారం మేనేజర్ శోభా బ్యాంకు ఖాతాదారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా పథకం, ప్రధాన మంత్రి సురక్ష బీమా పథకం, అటల్ పెన్షన యోజన, జనరల్ ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇటీవల రామానగరం గ్రామంలో గులాబీ ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యురాలు దార్ల బేబి ఇటీవల మృతిచెందింది. బేబీ ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకంలో ఉండడంతో రూ.2 లక్షలు ఇన్సూరెన్స్ మంజూరైంది. ఆ చెక్కును మృతురాలికి నామినిగా ఉన్న సురేశ్‌కు శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఐఆర్ఐఎక్స్ ఆపరేషన్ మేనేజర్ రవికుమార్, ఛానల్ మేనేజర్ జగదీశ్, బ్యాంకు మిత్ర జయంతి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలి

ఖమ్మం, నవంబర్ 16 : ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పీవోడబ్ల్యూ, పీవైఎల్ జిల్లా కార్యదర్శులు ఆవుల మంగతాయి, ఎన్‌వీ రాకేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందకపోవడంతో ప్రజలు తప్పని పరిస్థితిలో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని అన్నారు. దీంతో వారు ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీకి పాల్పడుతూ టెస్టులు, మందుల పేరుతో లక్షల రూపాయల బిల్లులు వేస్తున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఉద్యమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు టీ ఝాన్సీ, పీవైఎల్ నగర కార్యదర్శి మక్కా రవీందర్, నాయకులు అశోక్, అరుణ, సోని తదితరులు పాల్గొన్నారు.